1 ఒకటినే వందశాతం..

పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం

- పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- నెలాఖరునే నిధుల విడుదల
- జిల్లాలో లబ్ధిదారులు 2,70,853 మంది..



సంజీవమ్మ



పుట్టపర్తి, జూలై 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం సవాల్‌గా తీసుకుంది. ఆగస్టు 1వ తేదీనే వందశాతం పూర్తి చేసేలా చర్యలు చేపడుతోంది. ఆ మేకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే మొదటి నెల జూలై 1న 99 శాతం పింఛన్ల పంపిణీని పూర్తిచేసి, రికార్డు సృష్టించారు. వలంటీర్లు లేకపోయినా సచివాలయ వ్యవస్థలోని గ్రామ కార్యదర్శుల ద్వారానే పింఛన్ల పంపిణీ చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ ఉన్నా 5 రోజుల వరకు పింఛన్ల పంపిణీ కొనసాగేది. వలంటీరు వ్యవస్థ లేకుండా పింఛన్ల పంపిణీ కష్టసాధ్యమని వైసీపీ నాయకులు విష్రప్రచారం సైతం చేశారు. దానిని వమ్ము చేస్తూ కూటమి ప్రభుత్వం ఈనెలలో తొలిరోజునే 99 శాతం పింఛన్లను పంపిణీ చేసింది. ఆగస్టు నెలలో 1వ తేదీనే జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులందరికీ పింఛన్ సొమ్ము అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం మండల, మున్సిపల్ స్థాయి అధికారులతో కలెక్టర్ టీఎస్ చేతన్ సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా ఈనెల 31వ తేదీనే ఆయా శాఖలకు బ్యాంకుల ద్వారా పింఛన్ మొత్తాన్ని డ్రా చేసుకునేందుకు అనుమతులు మంజూరు చేశారు.

పింఛన్‌దారులతో సీఎం ముఖాముఖి

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఆగస్టు 1న మడకశిర నియోజకవర్గం గుండుమలలో పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. పింఛన్ల పంపిణీ అనంతరం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. ఇందుకోసం జిల్లా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నారు. ఎన్నికల హామీ అమలులో భాగంగా పింఛన్ సొమ్మును పెంచడం, ఆర్థిక కష్టాల్లో ఉన్నా అమలు చేస్తుండడాన్ని చంద్రబాబు వివరించనున్నారు.

పింఛన్‌దారులు 2,70, 853 మంది..

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పొందేవారి సంఖ్య 2,70,853. వీరిలో వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక అనారోగ్య బాధితులు, కిడ్నీ రోగులు ఉన్నారు. వీరికి ప్రతినెలా 116.19 కోట్ల రూపాయలు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు నెలకు సంబంధించి ఈనెల 31వ తేదీనే పింఛన్ నిధులు విడుదల కానున్నాయి. ఆ మేరకు ఏర్పాట్లు చేశారు.

కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

ఆగస్టు 1వ తేదీనే శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. యంత్రాంగాన్ని ఆదేశించారు. మడకశిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సోమవారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయా మండలాలు, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 31నే బ్యాంకుల నుంచి నగదు తెచ్చుకోవాలన్నారు. 1వ తేదీన ఉదయం 5.30 గంటలకే పించన్‌పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో 9,589 మంది పాల్గొనాలనీ, ఇందుకు సంబంధించి ఈపోస్ యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలనీ, లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

చంద్రబాబు నుంచి పింఛన్ అందుకోనున్న సంజీవమ్మ

మడకశిర రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టు 1న మండలంలోని గుండుమల గ్రామంలో పింఛన్ పంపిణీలో పాల్గొననున్నారు. చంద్రబాబు చేతుల మీదుగా గ్రామానికి చెందిన సంజీవమ్మ వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందుకోనున్నారు. సంజీవమ్మ సోమవారం మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అంటే తనకు ఎంతో అభిమానం అన్నారు. నిరుపేదల కష్టాలు తెలిసిన నేత అని కొనియాడారు. తమ ఇంట్లో చంద్రబాబునాయుడు ఫొటో పెట్టుకుని, నిత్యం పూజిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు రాకతో తన జన్మ ధన్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా గుండుమల పంచాయతీ ప్రజలు చంద్రన్న పండుగ చేయాలని నిర్ణయించుకున్నారు.

విజ్ఞానం.. దూరం..!

- ప్రభుత్వ బడుల్లో తెరుచుకోని గ్రంథాలయాలు
- నిర్వహణ మరచిన గత వైసీపీ ప్రభుత్వం
- పుస్తకాల్లేవ్.. లైబ్రేరియన్లు లేరు..
- విద్యార్థులకు దూరమైన గ్రంథాలయాలు



కొత్తచెరువు/పుట్టపర్తి రూరల్, జూలై 29: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద నిర్మాణాలు చేపడుతూ.. విద్యా సంస్కరణలు అమలు చేస్తున్నామని గత వైసీపీ పాలకులు గొప్పలు చెప్పుకున్నారు. విద్యార్థుల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే గ్రంథాలయాలపై నిర్లక్ష్యం ప్రదర్శించారు. వాటి నిర్వహణ మరిచారు. కొత్త పుస్తకాలు సరఫరా చేయలేదు, లైబ్రేరియన్లను సైతం నియమించలేదు. దీంతో పుస్తకాలు, లైబ్రేరియన్లు లేక గ్రంథాలయాలు మూతపడ్డాయి. విద్యార్థులకు విజ్ఞానాన్ని దూరం చేశారు.

అన్నీ మూత..

విద్యార్థుల్లో మేధోసంపత్తిని పెంపొందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం 2014లో జిల్లా పరిషత్ పాఠశాలల్లో అకడమిక్ గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను సైతం అందించింది. విద్యార్థులను గ్రంథాలయాలకు దగ్గర చేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అకడమిక్ గ్రంథాలయాల నిర్వహణను అటకెక్కించింది. కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న లైబ్రేరియన్లకు జీతాలు కూడా చెల్లించలేదు. దీంతో జిల్లాలోని 224 జిల్లా పరిషత్ పాఠశాలల్లోని అకడమిక్ గ్రంథాలయాలు మూతపడ్డాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అకడమిక్ గ్రంథాలయాల నిర్వహణకు నిధులిచ్చి, లైబ్రేరియన్లను నియమించి వినియోగంలోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పుస్తకాలకు చెదలు

పాఠశాలల్లోని అకడమిక్ గ్రంథాలయాల్లో లైబ్రేరియన్ల కొరత ఉంది. వీటికి గ్రంథాలయ సంస్థ నుంచి లైబ్రేరియన్లను నియమించాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరుతున్నారు. గ్రంథాలయ సంస్థ ఆధీనంలో నిర్వహించే లైబ్రరీల్లోనే సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడంతో అకడమిక్ గ్రంథాలయాలను పట్టించుకునే అవకాశం లేకుండా పోయింది. కొన్ని పాఠశాలల్లో లైబ్రేరియన్లు లేకపోయినా ఉపాధ్యాయులే బాధ్యత తీసుకుంటూ గ్రంథాలయాలను నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో గ్రంథాలయాలు తెరుచుకోకపోవడంతో ఎలుకలు.. పుస్తకాలను నాశనం చేస్తున్నాయి. మరికొన్నిచోట్ల పుస్తకాలకు చెదలు పడుతున్నాయి. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగపడే పుస్తకాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



జిల్లాపరిషత్ పాఠశాలల్లోని అకడమిక్ గ్రంథాలయాలను నిర్వహించేందుకు లైబ్రేరియన్లు లేరు. దీంతో పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో వారంలో ఒక పీరియడ్ గ్రంథాలయాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. తద్వారా విద్యార్థులకు గ్రంథాలయాలను అందుబాటులో ఉంచుతున్నాం. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

- మీనాక్షి, జిల్లా విద్యాధికారి

డ్రగ్స్‌ను అంతం చేయాలి

సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

విద్యార్థినుల డిమాండ్



ముఖాముఖిలో మాట్లాడుతున్న విద్యార్థిని

పెనుకొండ టౌన్, జూలై 29: డ్రగ్స్ వాడకం ద్వారా జీవితాలు నాశనమవుతున్నాయనీ, వాటిని అంతం చేయాలని విద్యార్థినులు అభిప్రాయపడ్డారు. స్థానిక మార్కెట్‌యార్డులో డ్రగ్స్ వాడకం, అనర్థాలు, కేసులపై డిగ్రీ విద్యార్థినులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ పరఫరా సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం.. డ్రగ్స్ నామరూపాల్లేకుండా చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఓ విద్యార్థిని

ప్రభుత్వం డ్రగ్స్‌ను పూర్తిగా ఎందుకు నిర్మూలించకపోతోంది? డ్రగ్స్ సరఫరాచేసే మాఫియాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. వాటిని అంతం చేయాలి. అప్పుడు డ్రగ్స్ వాడకం ఉండదు కదా.

వాడకం తప్పు అని చెప్పాలి: ఓ విద్యార్థిని

విద్యార్థి దశలోనే మాదకద్రవ్యాలపై అవగాహన ఉండాలి. ఎవరైనా దానికి అలవాటుపడితే తప్పు అని చెప్పాలి. అలాంటి వారికి దూరంగా ఉండాలి. లేకుంటే మన జీవితాలు రోడ్డునపడతాయి.

ప్రశ్నించే ధైర్యం ఉండాలి: డిగ్రీ విద్యార్థిని

డ్రగ్స్ తీసుకునేవారు మనకు అలవాటు చేయాలని చూస్తే గట్టిగా ప్రతిఘటించాలి. వారిని నిలదీయాలి. పిల్లల చదువుకోసం తల్లిదండ్రులు పడే కష్టాన్ని గుర్తు చేసుకోవాలి. డ్రగ్స్ వాడేవారి వివరాలను పోలీసులకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.



ప్రభుత్వాస్పత్రిలో రోగులతో మాట్లాతున్న మంత్రి సత్యకుమార్

మెరుగైన వైద్యం అందించాలి

● మంత్రి సత్యకుమార్ యాదవ్ ● ధర్మవరం ప్రభుత్వాస్పత్రి పరిశీలన

ధర్మవరం, జూలై 29: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చొరవ చూపాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిని సోమవారం సాయంత్రం మంత్రి పరిశీలించారు. వార్డుల్లోని రోగులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవితో సమస్యలపై ఆరాతీశారు. మంత్రి మాట్లాడుతూ... ఆస్పత్రిని అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త భవనాలు నిర్మించి, వసతులు కల్పిస్తామన్నారు. సిబ్బంది కొరతలేకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వివిధ విభాగాల ఉద్యోగులు.. తమ సమస్యలను తెలుపుతూ మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రజలనుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్‌లు డాక్టర్ పాల్‌రవికుమార్, తిప్పేంద్రనాయక్, జిల్లా ఉపవైద్యాధికారి సెల్వియా సాల్మన్ పాల్గొన్నారు.

శభాష్.. ఎస్ఐ..



బాధితుడికి నగదును అందజేస్తున్న ఎస్ఐ రాజేశ్

పెనుకొండ టౌన్, జూలై 29: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి సంబంధించిన డబ్బును ఆయనకు అందేలా చేసి పెనుకొండ ఎస్ఐ రాజేశ్ శభాష్ అనిపించుకున్నారు. పట్టణ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శ్రీకృష్ణదేవరాయల జైజంక్షన్ వద్ద ఆర్టీసీ లగ్జరీ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేశ్ ప్రమాద స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. బెంగళూరు నుంచి బస్సులో అనంతపురానికి వెళ్తున్న బియ్యం వ్యాపారి సయ్యద్ ముస్తక్ గాయపడ్డారు. ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఆయన బ్యాగులో రూ.8.50 లక్షల నగదు ఉంది. ఆ బ్యాగు మాత్రం బస్సులోనే పడిపోయింది. బాధితుడు విషయం తెలపడంతో ఎస్ఐ రాజేశ్ అప్రమత్తమై బస్సులో సోదాచేసి, బ్యాగును గుర్తించారు. ఆస్పత్రి డ్యూటీ వైద్యుడు, కుటుంబ సభ్యుల సమక్షంలో బాధితుడికి అప్పగించారు.

అధికారం అమ్మది...

పెత్తనం కుమారుడిది..



చైర్‌పర్సన్ సీటులో కూర్చున్న జయరాజ్

మడకశిరటౌన్, జూలై 29: మడకశిర నగర పంచాయతీ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అయితే.. ఆమె కుమారుడు జయరాజ్ పెత్తనం చెలాయిస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర పంచాయతీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లోని ఆమె సీటులో జయరాజ్ సోమవారం కూర్చుని, సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ కనిపించారు. అతడి తీరును పట్టణ ప్రజలే కాదు, పలువురు కౌన్సిలర్లు సైతం బహిరంగంగానే తప్పుపడుతున్నారు. గతంలో కూడా జయరాజ్ ఇలాగే వ్యవహరించి విమర్శలపాలయ్యాడు. అయినా.. ఆయన తీరు మారకపోవడం గమనార్హం.

ప్రజాసమస్యలను

సత్వరమే పరిష్కరించాలి

జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి, జూలై 29: అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే వాటికి పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై 221 అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అర్జీదారులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డ్వామాపీడీ విజయేంద్ర ప్రసాద్, ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డీపీఓలో 38 ఫిర్యాదులు..

పుట్టపర్తి రూరల్: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 38 ఫిర్యాదులు అందాయి. వీటిని స్వీకరించిన డీఎస్పీ వాసుదేవన్.. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, న్యాయ సలహాదారు సాయినాథరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మఠం భూమి...

వైసీపీ నాయకుల పిత్రార్జితమా?

రూ.కోట్ల విలువైన భూమిని కేతిరెడ్డి అనుచరులు కబ్జా చేశారు

సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

భూమి పేదలకు దక్కేవరకు పోరాటం ఆగదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామక్రిష్ణ

బత్తలపల్లి, జూలై 29: కర్ణాటకలోని నిడుమామిడి జంగం మఠం భూమి.. వైసీపీ నాయకులకు పిత్రార్జితంగా వచ్చిందా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ మండిపడ్డారు. మండల కేంద్రం సమీపంలోని కోట్లాది రూపాయల విలువైన మఠం భూమిని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అనుచరులు నకిలీ పత్రాలతో కబ్జా చేశారని ఆరోపించారు. ఈ భూమిని పేదలకు పంచేవరకు సీపీఐ పోరాటం సాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మండల కేంద్రం సమీపంలోని నిడుమామిడి జగం మఠం భూమిలో పేద ప్రజలు వేసుకున్న గుడిసెలను రామక్రిష్ణ సోమవారం పరిశీలించారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా భూఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో పేద ప్రజలకు చెందిన విలువైన భూములను వైసీపీ నాయకులు లాగేసుకున్నారనీ, అప్పటి ప్రభుత్వం అందుకు సహకరించిందని విమర్శించారు. బత్తలపల్లిలో మఠం భూమిని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రధాన అనుచరుడు ఈశ్వర్‌రెడ్డి పేరుమీద ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. ఈ భూమిని వైసీపీ నాయకులు గత ప్రభుత్వ పాలనలోనే ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకోలేక పోయారనీ, అలాంటిది కూటమి అధికారం చేపట్టాక వారి పేరుమీద ఎలా ఎక్కిస్తారని మండిపడ్డారు. మఠం భూమి అన్యాక్రాంతమైందని పత్రికల్లో కథనాలు వస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోందన్నారు. వీరి మద్దతుతోనే ఇంత వివాదాస్పదమవుతున్నా ఆ భూములను వైసీపీ నాయకులకు యథేచ్ఛగా మరొకరి పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తున్నారని మండిపడ్డారు. మఠం భూమి ఆక్రమించుకున్న వారిపైనా, వారికి సహకరించిన అధికారులపైనా క్రిమినల్ కేసులు నమోదు చేసి, జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఎన్ని కుయుక్తులు పన్నినా.. మఠం భూమి పేదలకు పంచకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఎకరాల భూములను వైసీపీ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. తమ అక్రమాలు బయట పడతాయనే మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి నిప్పుపెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యాక్రాంతమైన భూములపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు ముగిసినా.. బిల్లులివ్వరా..!

బకాయిల కోసం డ్రైవర్ల ఆందోళన

పుట్టపర్తిరూరల్, జూలై 29: సార్వత్రిక ఎన్నికల్లో ప్రైవేటు వాహనాలను ఉపయోగించుకుని, బిల్లులు చెల్లించకపోవడంతో డ్రైవర్లు ఆందోళనకు దిగారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు సోమవారం బైఠాయించి నిరసన తెలిపారు. డ్రైవర్ల సంఘం నాయకుడు షానవాజ్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో 26 వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు ముగిసి రెండున్నర నెలలైనా బిల్లులు మాత్రం చెల్లించలేదన్నారు. రూ.6 లక్షలకుపైగా బిల్లులు రావాల్సి ఉండగా.. రూ.80వేలు మాత్రమే చెల్లించారనానరు. మిగిలిన మొత్తం కోసం పలు మార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవట్లేదని వాపోయారు. బిల్లులు అందక వాహనాల ఈఎంఐలు సైతం చెల్లించలేకపోతున్నామని ఆవేదన చెందారు. బకాయి బిల్లులు చెల్లించేవరకు కదిలేది లేదంటూ భీష్మించారు. తహసీల్దార్ వేణుగోపాల్ వారి వద్దకు వచ్చి బిల్లులు ట్రెజరీకి పంపామనీ, వచ్చిన వెంటనే చెల్లిస్తామంటూ సర్ది చెప్పబోయారు. బిల్లుల కోసం ఎన్నిమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాలంటూ తహసీల్దార్‌ను నిలదీసారు. రెండురోజుల్లో బిల్లులు చెల్లించకపోతే నిరసన తప్పదని హెచ్చరించి, వెళ్లిపోయారు.



ఆర్డీఓ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న డ్రైవర్లు

ఫొటో దిగితే.. సమస్య పరిష్కరించినట్లేనా?

తనకల్లు, జూలై 29: ప్రజాఫిర్యాదుల పరిష్కారంలో యంత్రాంగం మాయలు ప్రదర్శిస్తోందనడానికి ఈ ఘటనే నిదర్శనం. మండలంలోని చీకటిమానిపల్లికి చెందిన పారేసు.. మండలంలో అనుమతి పొందిన ప్రథమ చికిత్స కేంద్రాల వివరాలు తెలియజేయాలని గత సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఆ తరువాత వైద్యులు, సిబ్బంది.. పారేసు వద్దకెళ్లి సమాచారం ఇస్తామని చెప్పి.. ఆయనతో ఫొటో దిగారు. అంతే.. జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి సమస్య పరిష్కారమైనట్లు ఆయన సెల్‌కు మెసేజ్ రావడంతో అవాక్కయ్యారు. దీంతో ఆయన సోమవారం మరోసారి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అర్జీని పరిష్కరించకుండా అధికారులు చేసిన మాయపై తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వివరించారు. మండలంలో కొక్కంటిక్రాస్‌లో అనుమతులు, అర్హత లేకపోయినా ప్రథమ చికిత్స కేంద్రాలు నిర్వహిస్తున్నారన్నారు. తెలిసీతెలియని వైద్యంతో పలువురిని బలిగొన్నారన్నారు. ఈవిషయంపై వివరాలు అడిగితే సమాచారం ఇవ్వకుండా ఇచ్చినట్లు, సమస్య పరిష్కరించినట్లు చెప్పడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమన్నారు. ఈవిషయంపై విచారణ చేపట్టాలని తహసీల్దార్‌ను కోరారు.



వినతిపత్రం సమర్పిస్తున్న పారేసు

అర్ధరాత్రి దొంగలు పడ్డారు

- నిఘా వేసి వెంబడించిన అన్నదమ్ములు
- రెండు బైక్‌లు, స్కార్పియో స్వాధీనం
- పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర ముఠా

నంబులపూలకుంట, జూలై 29: అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆదివారం అర్ధరాత్రి హల్‌చల్ చేసింది. నలుగురు దొంగలు రెండు బైకుల మీద నంబులపూలకుంట మండలానికి వచ్చారు. కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో కొట్టంవారిపల్లి వద్ద వాహనాలను ఆపి.. ఓ ఇంటి వైపు వెళ్లారు. ఆ ఇంటి యజమాని గమనించి కేకలు వేశారు. దీంతో దొంగలు పారిపోయేందుకు ప్రత్నించారు. ఒక వాహనం రాయచోటి వైపు, మరో వాహనం కదిరివైపు వెళ్లాయి. ఇంటి యజమాని కుమారులు మహేష్, గణేష్ కదిరివైపు వెళుతున్నవారిని బైకుమీద వెంబడించారు. అది గమనించిన దొంగలు, గాండ్లపెంట మండలం చామలగొంది రోడ్డు సమీపంలో వాహనాన్ని వదిలి పరుగులు తీశారు. వారు వదిలి వెళ్లిన బైకు వద్ద సోమవారం తెల్లవారుజాము వరకు మహేష్, గణేష్ మాటు వేశారు. తెల్లవారుజామున ఏపీ 03 బీఎఫ్ 1746 నంబరుగల స్కార్పియో వాహనం అక్కడికి వచ్చింది. అందులో ఉన్న వ్యక్తులు దొంగలు వదిలివెళ్లిన బైకును తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. మహేష్, గణేష్ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో దొంగలు స్కార్పియో ఎక్కి తప్పించుకుని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని సోదరులిద్దరూ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు స్పందించి అదే మండలంలోని తిమ్మమ్మమర్రిను హైస్కూల్ వద్ద ఉన్న జనసేన మండల అధ్యక్షుడు చౌదరికి సమాచారం అందించారు. వెంటనే ఆయన గ్రామస్థులతో కలిసి ఓ ఎక్స్‌కవేటర్‌ను, కొన్ని వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టించారు. స్కార్పియో రాగానే అందులో ఉన్న ముగ్గురు దొంగలను పట్టుకునేందుకు గ్రామస్థులు ప్రయత్నించారు. వారిలో ఇద్దరు పారిపోగా, డ్రైవర్‌ను దొరకబుచ్చుకున్నారు. డ్రైవర్‌ను, స్కార్పియోను పోలీసులకు అప్పగించారు. స్కార్పియోలో ఇంటర్‌నెట్ పరికరాలు, మూడుకొత్త మొబైల్ ఫోన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌ను విచారించి.. తప్పించుకున్న ఇద్దరిని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పట్టుకున్నారు. ఆ తరువాత మరో పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పాత నేరస్థులే..

పోలీసులకు పట్టుబడిన స్కార్పియో వాహనం అన్నమయ్య జిల్లా తూముకుంట దిగువమూలకు చెందిన యోగీశ్వర్‌నాయుడు పేరిట ఉంది. వాహనాన్ని తానే నడుపుతుంటారు. పోలీసులకు పట్టుబడింది ఇతనే. మిగిలిన నలుగురు బైక్‌ల మీద రాగా.. వారిని కవర్ చేస్తూ యోగీశ్వర్ నాయుడు తన స్కార్పియోలో వచ్చాడు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకు (ఏపీ 40 బీవీ6889) తూర్పు గోదావరి జిల్లా రాజానగరం వారి జయప్రకాష్ పేరిట ఉంది. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు పట్టుకున్న మరో ఇద్దరు కర్ణాటకవాసులని తెలిసింది. ఈ ముఠా సూత్రధారి చిత్తూరు జిల్లావాసి అని పోలీసులు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పట్టుబడినవారిపై ఎర్రచందనం కేసులు కూడా ఉన్నట్లు సమాచారం. సబ్ జైళ్లలో ఏర్పడిన పరిచయాలతో వీరు ముఠాగా ఏర్పడినట్లు తెలిసింది.




స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చోరీలు

పోలీసుల అదుపులో ఉన్న దొంగల ముఠా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ముఠా సభ్యుల వద్ద ఉన్న సెల్ ఫోన్ లలో సిమ్ కార్డులు లేవని, ఇంటర్‌నెట్‌తో అన్ని మొబైల్స్ అనుసంధానం చేసుకున్నారని సమాచారం. స్కార్పియోలో ఉన్న యోగీశ్వర్ నాయుడికి వీరి కదలికలు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారానే తెలుస్తాయి. వాటి ఆధారంగా ఇబ్బందులు ఎదురైతే వెంటనే రంగంలోకి దిగి రక్షించేందుకు రంగంలోకి దిగేవాడు. ఇతని వద్ద ఉన్న పరికరాల ఆధారంగానే పారిపోయిన ఇద్దరిని పోలీసులు వెంటనే పట్టుకోగలిగారు.



దొంగలను వెంబడించిన యువకులు మహేష్, గణేష్

నగదు.. ఆభరణాలు..

పట్టుబడిన స్కార్పియోలో రూ.10 వేలు నగదు, ఒక చేతి గడియారం, ఒక జత వెండి కాళ్ల పట్టీలు, మూడు జతల అద్దాలు, వైఫై మోడెం, సెల్‌ఫోన్‌లు తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా దువ్వూరులో శనివారం రాత్రి ఓ బైక్‌ను చోరీ చేసి తెచ్చినట్లు సమచారం. పోలీసులకు పట్టుబడ్డ పల్సర్ వాహనం కొనుగోలు చేసి దాదాపు 20 రోజులై ఉంటుంది. ఇంకా నంబర్ కూడా రాలేదు.



స్వాధీనం చేసుకున్న స్కార్పియో వాహనం

తుంగభద్రకు కొనసాగుతున్న వరద



టీబీ డ్యాం నుంచి దిగువకు వదిలిన వరదనీరు

బొమ్మనహాళ్, జూలై 29: తుంగభద్ర జలాశయానికి వరదనీరు పోటెత్తడంతో మొత్తం 33 క్రస్ట్ గేట్ల(26 గేట్లు రెండున్నర అడుగులు, మరో 7 గేట్లు ఒక్క అడుగు మేర)ను ఎత్తి దిగువకు నీరు వదిలారు. 1,47,518 క్యూసెక్కుల నీటిని తుంగభద్రనదికి, 9087 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 1,46,257 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో కాలువలకు వదిలే నీటితో కలిపి 1,56,840 క్యూసెక్కులు ఉంది. డ్యాం నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 97.448 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని నదికి వదిలేస్తున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 వ కి.మీ. వద్ద 1170 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

పీఏబీఆర్‌కు 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కూడేరు: తుంగభద్ర డ్యాం నుంచి పీఏబీఆర్ డ్యాంలోకి 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈఈ లక్ష్మీదేవి తెలిపారు. వరద జలాలు వస్తున్న నేపథ్యంలో పీఏబీఆర్ డ్యాంలో సోమవారం నీటి మట్టం పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 417.00 మీటర్ల వరకు నీటి నిల్వ ఉంది.

కిలో టమోటా రూ.30

అనంతపురం రూరల్, జూలై 29: కక్కలపల్లి మార్కెట్‌లో సోమవారం కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయింది. సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.13 పలికాయి. మార్కెట్‌కు మొత్తంగా 1500 టన్నులు వచ్చాయని రాప్తాడు మార్కెట్‌యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, జూలై 29: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా ధర రూ. 17200, కనిష్ఠంగా రూ. 2500, సరాసరి ధర రూ. 12వేలతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 741 టన్నులు వచ్చాయన్నారు.

సీఎం దృష్టికి 'సీమ' కరువు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం విద్య, జూలై 29: రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా కురుస్తుంటే సీమ జిల్లాలో చినుకు జాడ లేకపోవడం బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే సీమ జిల్లాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీపీఐ ఆఫీస్‌లో సోమవారం పార్టీ అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య తో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఏపీలో అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు, నిస్వార్థ సేవకులు ఉన్నారన్నారు. టంగుటూరి ప్రకాశంపంతులు, పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వర్‌రావు వంటి మహనీయుల పేర్లను భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు పెడతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. పోలవరం నిర్వాసితులకు రూ.30వేల కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రతి ఏటా వర్షాలు వచ్చినప్పుడు వాళ్ల ఇళ్లు ఖాళీ చేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. సీమ జిల్లాల్లో నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా...ఇప్పటి వరకూ లక్ష ఎకరాల్లోనే పంట వేశారన్నారు. ప్రభుత్వం ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ మార్గాలపై ఆలోచన చేయాలని సూచించారు. హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువ ద్వారా అదనపు నీళ్లు తెప్పించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కరువు పరిస్థితులు వివరించాడానికి ఈ నెల 31న సీఎం చంద్రబాబును కలుస్తామని విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణ స్వామి, శ్రీరాములు, లింగమయ్య, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

స్వీడన్‌లో బీటెక్ చదివే అవకాశం

- జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య



బీటీహెచ్ ప్రవేశాలు పొందిన విద్యార్థులతో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య

అనంతపురం సెంట్రల్, జూలై 29: జేఎన్‌టీయూ, బ్లెకింగ్ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో అమలుచేస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్సుల ద్వారా స్వీడన్‌లో బీటెక్ చదివే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య తెలిపారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆధ్వర్యంలో సోమవారం 13మంది విద్యార్థులకు క్రిష్ణయ్య అడ్మిషన్ పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కోర్సు ద్వారా బీటెక్ మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూలో, చివరి సంవత్సరం స్వీడన్‌లోని బ్లెకింగ్ వర్సిటీలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. బీటెక్ డిగ్రీ పట్టాను జేఎన్‌టీయూ, బీఎస్సీ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ ప్రదానం చేస్తాయన్నారు. అనంతరం స్వీడన్‌లోనే ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుజాత, కిరణ్మయి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లలు దాటిన ఎస్కేయూ ఖ్యాతి: ఇన్‌చార్జి వీసీ



వేడుకల్లో పాల్గొన్న వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్‌లతో అధికారులు

అనంతపురం సెంట్రల్, జూలై 29: విద్యార్థులకు ఉన్నతమైన విద్యనందించి, ప్రతిభావంతులుగా తీర్చడంతో ఎస్కేయూ ఖ్యాతి ఎల్లలు దాటిందని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. సోమవారం ఎస్కేయూ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళులర్పించి వేడుకలను ప్రారంభించారు. 1967లో వెంకటేశ్వర పీజీ సెంటర్‌గా ప్రారంభించిన ఎస్కేయూ ప్రస్తుతం వేలాది విద్యార్థులకు పీజీ, పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేస్తోందని తెలిపారు. వర్సిటీ విద్యర్థులు అనేకమంది దేశవిదేశాల్లో ఉన్నతస్థాయిల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది, రీసర్చ్ స్కాలర్స్‌తోపాటు వీఆర్వో ప్రొఫెసర్ రామగోపాల్ పాల్గొన్నారు.

పనిమంతులను ప్రోత్సహిస్తా

- వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్
- ఎమ్మెల్యే దగ్గుపాటితో కలిసి సర్వజనాస్పత్రి తనిఖీ
- గైనిక్, బాలింతలు, రక్తనిధి, ఆర్థోవార్డుల పరిశీలన
- రోగులతో వైద్యసేవలపై ఆరా

అనంతపురం టౌన్, జూలై 29: మంచిగా పనిచేస్తే ప్రోత్సహిస్తా. తప్పుచేస్తే శిక్షిస్తానని వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ డాక్టర్లు, వైద్య సిబ్బందిని హెచ్చరించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన అనంత ప్రభుత్వసర్వజన ఆస్పత్రికి సోమవారం వచ్చారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర్‌ప్రసాద్‌తో కలిసి ఆస్పత్రిని తనిఖీ చేశారు. గైనిక్, బాలింతల వార్డులకు వెళ్లి అక్కడ గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు, వసతులను స్వయంగా పరిశీలించారు. రోజుకు ఎంతమంది డెలివరీకి వస్తున్నారు? ప్రస్తుతం ఎంతమంది ఆస్పత్రిలో ఉన్నారు? పడకలు ఎన్ని ఉన్నాయి? ఎలా సర్దుబాటు చేస్తున్నారు? తదితర వివరాలను సూపరింటెండెంట్, ఆర్ఎంఓలను అడిగి తెలుసుకున్నారు. అక్కడనుండి రక్తనిధి కేంద్రానికి వెళ్లి రక్త నిల్వలు పరిశీలించారు. ఆర్థోవార్డుకు వెళ్లి అక్కడ చికిత్సపొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో వసతుల పెంపునకు సహకరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంత్రికి విన్నవించారు. అక్కడి నుంచి వైద్య కళాశాలకు వెళ్లి వైద్యాధికారులు, డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

శాఖాపరంగా కొన్ని సమస్యలు, లోటు పాట్లు ఉన్నాయి. వాటిని అడ్డుపెట్టుకొని రోగులకు వైద్యసేవలు అందించడంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయవద్దని వైద్యాధికారులు, డాక్టర్లను మంత్రి సత్యకుమార్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రజలలో ఓరకమైన భావన ఉంటుందని, అలాంటపుడు మనం మరింత బాధ్యతగా పని చేసి నమ్మకాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని, ఆస్పత్రికి వచ్చిన రోగులను ప్రేమగా చిరునవ్వుతో మాట్లాడించి చికిత్స అందించాలన్నారు.



వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి



వైద్యాధికారులు, డాక్టర్ల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

1200 పడకల స్థాయి పెంపునకు కృషి

అనంతసర్వజన ఆస్పత్రిని 1200 పడకల ఆస్పత్రిగా మార్చడానికి కృషి చేస్తానని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం అనంత ఆస్పత్రిలో 560 పడకల సామర్థ్యం మాత్రమే ఉందన్నారు. ఈఆస్పత్రికి రోజుకు 2వేలమందికి పైగా ఓపీకి, 1500వరకు అడ్మిషన్లు ఉంటున్నాయన్నారు. అయితే 560 పడకలకు సరిపడే డాక్టర్లు, సిబ్బంది, వసతులు మాత్రమే ఉన్నాయన్నారు. 2019 లోనే ఈఆస్పత్రికి ఎంసీహెచ్‌బ్లాక్, సర్జికల్ బ్లాక్ ఏర్పాటుకు రూ.300కోట్లు నిధులు ఇచ్చినట్లు వెల్లడించారు. కానీ ఇప్పటికీ ఎంసీహెచ్‌బ్లాక్ పనులు మొదలు కాలేదని, సర్జికల్‌బ్లాక్ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ఈపరిస్థితి ఏర్పడిందన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్నివిభాగాలు పనిచేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పెనుకొండలో వైద్య కళాశాల పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

టీడీపీ నాయకులపై వైసీపీ దాడి

ఉరవకొండ, జూలై 29: మండలంలోని లత్తవరం గ్రామంలో టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. రెండేళ్లయినా గ్రామంలో పారిశుధ్య పనులను వైసీపీ నాయకులు పట్టించుకోకపోవడంతో, సోమవారం ఉదయం టీడీపీ నాయకులు అధికారులతో కలిసి డ్రైనేజీలను పరిశీలించారు. ఈనెల26న ఉపసర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారుడు ఎన్నిక కావడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. ఈక్రమంలోనే వైసీపీ నాయకులు టీడీపీ నాయకులను దూషించి, కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఉరవకొండ నుంచి లత్తవరానికి మాజీ సర్పంచ్ గోవిందుతో పాటు మరో ఐదుగురు టీడీపీ నాయకులు వెళ్లారు. పక్కా ప్రణాళికతో ఉన్న వైసీపీ నాయకులు కళ్లల్లోకి కారంపొడి చల్లి, రాళ్లతో టీడీపీ నాయకులపై దాడి చేశారు. మాజీ సర్పంచ్ గోవిందుతో పాటు, మోహన్, గోపాల్, నాగరాజు గాయపడ్డారు. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మరోసారి సర్పంచ్ వంశీ అనుచరులు దాడి చేసేందుకు యత్నించారు. వైసీపీకి చెందిన హనుమంతు, సురేంద్ర, ఓబులపతి, నవీన్‌లతోపాటు 20మంది దాడి చేసినట్లు టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి నేపథ్యంలో గ్రామంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.



గాయపడిన మాజీ సర్పంచ్ గోవిందు



పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న టీడీపీ నాయకులు

అక్కా.. బాగున్నారా..!



విజయమ్మతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, జూలై 29: హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో సోమవారం వైఎస్ విజయమ్మను టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కలిశారు. చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వెళ్లగా వెయిటింగ్‌హాలులో ఉన్న వైఎస్ విజయమ్మను జేసీపీఆర్ గమనించారు. వెంటనే ఆమె వద్దకు వెళ్లి 'అక్కా.. బాగున్నారా..?' అని పలకరించారు. ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. ఇరువురు కుటుంబ సభ్యుల బాగోగులపై ఆరాతీసినట్లు సమాచారం.

డిగ్రీ పరీక్షల్లో 98 శాతం ఉత్తీర్ణత

అనంతపురం సెంట్రల్, జూలై 29: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల్లో 98శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. సోమ వారం పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫసర్ జీవీ రమణ ఆధ్వర్యంలో ఇన్ చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఫలితాలను విడుదలచేశారు. ఆమె మాట్లాడుతూ డిగ్రీ చివరి సంవత్సరంలో సబ్జెక్టులు ఫెయిల్ అయి పీజీ ప్రవేశాలకు విద్యార్థులు దూరంగా ఉండకూడదన్న ఉద్దేశంత్ ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించా మన్నారు. 324మంది పరీక్షలకు నమోదుచేసుకోగా 319మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. వీరిలో కేవలం ఐదుగురు మాత్రమే ఫెయిల్ అయ్యారన్నారు.

చంద్రబాబు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు: డీఐజీ

మడకశిర, జూలై 29: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చే నెల 1న గుండుమల గ్రామంలో పర్యటిస్తున్నారని, పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని డీఐజీ షీమూషి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం గుండుమల గ్రామంలో చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ స్థలాన్ని ప్రజా వేదిక స్థలాన్ని పింఛన్లు పంపిణీ చేసే ఇళ్ల వద్ద పరిశీలించారు. సీఎం పర్యటనకు రెండు రోజులే ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లను వేగవంతం చేయాలని, బందోబస్తుకు సంబంధించిన విషయాలను చర్చించారు. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, కదిరి ఆర్డీఓ వంశీకృష్ణ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితోపాటు డీఎస్పీ బాజీజాన్‌సైదా, సీఐ, ఎస్ఐలతో కలిసి ఏర్పాట్లపై చర్చ జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో చిన్న పొరపాట్లకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పలు సూచనలు చేశారు. పింఛన్ల పంపిణీ సమయంలో ఇళ్ల వద్దకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వెళ్లనున్న నేపథ్యంలో ఎలాంటి బందోబస్తు చేపట్టాలనే విషయంలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు జయప్ప, మాజీ సర్పంచ్ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



పర్యటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఐజీ, టీడీపీ నాయకులు

విద్యుదాఘాతంతో రైతు మృతి

తాడిపత్రి, జూలై 29: విద్యుదాఘాతంతో పెద్దపప్పూరు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన యువ రైతు హరినాథ్‌రెడ్డి (33) సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హరినాథ్‌రెడ్డి తన తోటలో మోటార్ పైపులను పైకి తీయడానికి తురకపల్లికి చెందిన శేఖర్‌ను కూలికి కుదుర్చుకున్నాడు. పైన ఉన్న విద్యుత్ తీగలను గమనించకుండా ఇద్దరూ కలిసి మోటార్ పైపులను పైకి లాగారు. పైపులు.. తీగలకు తగలడంతో ఇద్దరికి విద్యుత్ షాక్ కొట్టింది. కూలి పనులకు వచ్చిన శేఖర్ తీవ్రంగా గాయపడి ఎగిరి అవతల పడ్డాడు. హరినాథ్‌రెడ్డి మాత్రం అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య హరిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చికిత్స నిమిత్తం శేఖర్‌ను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



రైతు హరినాథ్‌రెడ్డి మృతదేహం

గొర్రెల మందపై చిరుత దాడి

కుందుర్పి, జూలై 29: మండల కేంద్రంలోని గొర్రెల మందపై చిరుత సోమవారం దాడి చేసింది. కాపరి వెంకటస్వామి జగనన్న కాలనీ పక్కన ఏర్పాటు చేసుకున్న దొడ్డిలోకి సాయంత్రం గొర్రెలను వదిలి పక్కనే ఉన్న ఇంట్లోకి వెళ్లాడు. గొర్రెలు అరవడంతో ఆయన బయటకు వచ్చాడు. మందలో చిరుత జొరబడటాన్ని గమనించి గట్టిగా కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు అక్కడకు రావడంతో చిరుత పక్కనే ఉన్న కొండ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. చిరుత దాడిలో ఓ గొర్రె మృతిచెందిందని కాపరి తెలిపారు.

గోడౌన్‌లోకి చొరబడ్డ ఎలుగుబంటి

కళ్యాణదుర్గం: పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న బిస్కెట్స్ ఏజెంట్స్ నిర్వాహకులు కరణం రాఘవేంద్ర గోడౌన్‌లోకి సోమవారం తెల్లవారుజామున ఎలుగుబంటి చొరబడి బీభత్సం సృష్టించింది. బాత్రూమ్ తలుపులు పగులగొట్టి బిస్కెట్ బాక్సులు చించేసింది. బిస్కెట్లన్నీ తినింది. ఈదృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డు కావడంతో విషయం బయటపడింది. చుట్టూ జనావాసాలున్నా చీకటిపడితే చాలు ఎలుగుబంట్ల బెడద ఎక్కువైంది. పట్టణంలోని నాయీబ్రాహ్మణకాలనీ, పూర్ణానంద ఆశ్రమం పరిసరాల్లో నిత్యం ఎలుగుబంటి సంచరిస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



ఎలుగుబంటి సీసీ ఫుటేజీ

నులిపురుగులను నిర్మూలిద్దాం: జేసీ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జేసీ, డీఎంహెచ్‌ఓ

పుట్టపర్తి రూరల్, జూలై 29: ఆరోగ్యవంతమైన చిన్నారుల కోసం నులిపురుగులను తరిమేద్దాం అనే నినాదంతో వచ్చేనెల 20న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జాయింట్ కలెక్టరు అభిషేక్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కారవేదిక సమావేశ మందిరంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1-19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్- 400 మి.గ్రా. మాత్రను వేయించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, ఆర్‌బీఎస్ ప్రాజెక్టు డైరక్టరు డాక్టర్ నివేదిత, డీపీఓంఓ డాక్టర్ కేసీకే నాయక్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, డీహెచ్‌ఓ వీరమ్మ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోండి

పుట్టపర్తి : ప్రతి క్రీడాకారుడు క్రమశిక్షణతో క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జేసీ అభిషేక్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ఒలంపిక్ విజేత మనుబాకర్ పోస్టర్‌ను విడుదల చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ... ఒలంపిక్ క్రీడల్లో పది మీటర్ల పిస్టల్ షూటింగ్‌లో క్యాంస పతకాన్ని సాధించి మనుకర్ భారతదేశం గౌరవప్రతిష్ఠను పెంచారని కొనియాడారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని, వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, క్రీడాశాఖాధికారి ఉదయ్‌భాస్కర్, ఆర్డీఓ భాగ్యరేఖ పాల్గొన్నారు.

ధర్మవరంలోనే లేబర్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

ధర్మవరం, జూలై 29: పట్టణంలో లేబర్ ఆఫీస్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు.. ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... ధర్మవరంలో గతంలో లేబర్ ఆఫీసు ఉండేదని, సత్యసాయి జిల్లా ఏర్పాటైన తరువాత కొత్తచెరువుకు తరలించారని అన్నారు. ధర్మవరం పట్టణంతో పాటు రూరల్, చెన్నేకొత్తపల్లి, బత్తలపల్లి, తాడిమర్రి, కనగానపల్లి మండలాలకు చెందిన కార్మికులకు ఏ చిన్న సమస్య వచ్చినా ధర్మవరంలో ఉన్న లేబర్ ఆఫీసు ఎంతో ఉపయోగపడేదన్నారు. ఇప్పుడు దూరంగా ఉండటం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ధర్మవరంలో లేబర్ ఆఫీసు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, నాయకుడు ఎస్‌హెచ్‌బాషా విజ్ఞప్తి చేశారు.

చేనేతలను ఆదుకోండి



డీఆర్‌ఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పుట్టపర్తి, జూలై 29: చేనేతలను, చేనేత పరిశ్రమల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డీఆర్‌ఓ కొండయ్యను కోరారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు రాజా, రవి కుమార్, రమణ, శ్రీధర్, వెంకటేసు, శ్రీనివాసులు, మరికొందరు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ వినతిపత్రం అందచేశారు. నేతన్న నేస్తం పథకాన్ని రూ. 24 వేల నుంచి రూ.36 వేలకు పెంచాలని, సొంత మగ్గం ఉన్నవారితో పాటు కూలిమగ్గాల్లో పనిచేసేవారికి వర్తింపచేయాలని కోరారు. జీఎస్టీని రద్దుచేసి అదరణ పథకాన్ని పునరుద్ధరించి సబ్సిడీతో వృత్తిపరికరాలను అందచేయాలన్నారు. 11 రకాల చేనేత వస్త్ర ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు వెయ్యి కోట్లు కేటాయించాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని వారు కోరారు.

కొత్తచెరువు ఇన్‌చార్జి ఈఓఆర్‌డీగా ఇందిరా బాల

కొత్తచెరువు, జూలై 29: కొత్తచెరువు ఈఓఆర్‌డీ సిద్దారెడ్డి పెనుకొండకు బదిలీ కాగా, ఆయన స్థానంలో బుక్కపట్నం ఈఓఆర్‌డీ ఇందిరా బాలకు కొత్తచెరువు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె వారితో మాట్లాడుతూ... ఆయా పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలి

ముదిగుబ్బ, జూలై 29 : ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడు ఆశిష్ కుమార్, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ హిందూపురం పార్లమెంట్ కో-ఆర్డినేటర్ తుమ్మల సురేంద్ర సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటికీ ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి రెండు బస్సులు మాత్రమే నడుస్తున్నాయని, కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, ఇతర కార్యాలయాలకు, పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రజలు తరచూ వెళ్తాంటారని, అధిక సర్వీసులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని కోరారు. గతంలో కదిరి నుంచి ముదిగుబ్బ మీదుగా తెల్లవారుజామున బెంగుళూరు బస్సు సర్వీస్ నడిచేదని, ఆ బస్సును రద్దు చేయడంతో ఉదయం ఆసుపత్రికి వెళ్లేవారు, సొంతపనులపై జిల్లా కేంద్రానికి వెళ్ళేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కదిరి నుంచి ముదిగుబ్బ మీదుగా పాత సర్వీసును పునఃప్రారంభించాలని, ఎక్స్‌ప్రెస్ బస్సులను నడపాలని కోరారు.

షాట్‌పుట్‌లో రాణించిన కేజీబీవీ విద్యార్థినులు

ఓబుళదేవరచెరువు, జూలై 29: ఇటీవల నల్లమాడలో జరిగిన అండర్ 16, 14 షాట్‌పుట్, రన్నింగ్‌లో క్రీడల్లో ఓడీసీ మండలంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచారు. అండర్ 16 షాట్‌పుట్‌లో వై. శృతి ప్రథమస్థానం, అండన్ 14 షాట్‌పుట్‌లో టి. శారణ్య ద్వితీయస్థానం, అండన్ 14 రన్నింగ్‌లో జి. స్వప్న ప్రథమ స్థానంలో గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎస్‌ఓ గీతాబాయి, వ్యాయామ ఉపాధ్యాయురాలు దేవి తెలిపారు. ఈ విద్యార్థినులను సోమవారం టీచర్లు అభినందించారు.



గెలుపొందిన విద్యార్థినులతో పాఠశాల సిబ్బంది

చికెన్ వ్యర్థాల కోసం కుక్కలు

రోడ్డుపై సంచరిస్తుండటంతో పలు ప్రమాదాలు

తనకల్లు, జూలై 29: మండలంలోని బొమ్మలకుంట సమీపంలో రోడ్డు పక్కన చికెన్ వ్యర్థాలను దుకాణదారులు పడేస్తున్నారు. దీంతో వాటి కోసం జాతీయ రహదారిపై అధిక సంఖ్యలో కుక్కలు తిరుగుతున్నాయి. అవి రోడ్లపై అడ్డంగా తిరుగుతుండటంతో వాటిని తప్పించబోయి... బైక్‌దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి ఈ పాంతలో రోడ్డు పక్కన చికెన్ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



చికెన్ వ్యర్థాల కోసం రోడ్డుపై తిరుగుతున్న కుక్కలు, రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాలు (ఇన్‌సెట్లో)

వైసీపీ నాయకుడి భూదాహం

- జాతీయ రహదారి స్థలాలు కబ్జా
- యథేచ్ఛగా షాపుల నిర్మాణం
- మున్సిపాలిటీ పైపులైన్‌పై కట్టడాలు
- నెలనెలా దర్జాగా అద్దె వసూళ్లు





జడ్జి బంగ్లా పక్క స్థలంలో, సైదాపురం దారిలో ఎద్దు గోరి స్థలంలో నిర్మించిన షాపు గదులు

కదిరి, జూలై 29: జాతీయ రహదారి స్థలాలను స్థానిక ఓ వైసీపీ నాయకుడు కొన్ని సంవత్సరాల క్రితం కబ్జా చేశాడు. అందులో దర్జాగా షాపు గదులను నిర్మించాడు. చివరకు మున్సిపాలిటీ పైపులైన్ మీద కూడా గదులను నిర్మించాడు. ఇలా ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఆ గదుల ద్వారా నెలనెలా వేలాది రూపాయలు అద్దెలు తీసుకుంటున్నాడు. గతంలో వైసీపీ అధికారంలో ఉండడం... కబ్జా చేసింది అదే పార్టీకి చెందిన నాయకుడే కావడంతో అధికారులు కూడా ఏమిచేయలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా అధికారులు ఆ స్థలాల్లోని ఆక్రమణలను తొలగించకపోవడం.. ఆ వైసీపీ నాయకుడు నెలనెలా అద్దె వసూళ్ల చేస్తుండటంపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం.. కందికుంట వెంకటప్రసాద్ ఎమ్మెల్యే కావడంతో ఆ స్థలాలకు విముక్తి కలుగుతుందని ప్రజలు భావిస్తున్నారు.

దర్జాగా భవన నిర్మాణాలు

అనంతపురం జాతీయ రహదారి పక్కన మరకత మహాలక్ష్మీ ఆలయం వద్ద ఐదు సెంట్ల స్థలాన్ని ఆ నాయకుడు, కౌన్సిలర్ భర్త ఆక్రమించాడు. ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. అలాగే జాతీయ రహదారి నుంచి ఆంజనేయస్వామి ఆలయం పక్కన సైదాపురం వెళ్లడానికి రహదారి ఉంది. జాతీయ రహదారి పక్కన గతంలో ఎద్దు గోరీ ఉండేది. ఇక్కడ దాదాపు ఐదు సెంట్లు స్థలం ఉంది. ఆ స్థలంలోనే సైదాపురానికి నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ వేశారు. వైసీపీకి చెందిన కబ్జాదారుడు ఇతరుల నుంచి ఆ స్థలాన్ని అతి తక్కువ ధరలకు కొనుగోలు చేసి అందులో భవనాలు నిర్మించారు. వీటి నుంచి ప్రస్తుతం రూ.లక్షకు పైగా అద్దెలు వస్తున్నాయి. ప్రభుత్వ స్థలాన్ని అతి చౌకగా కొనుగోలు చేసి నిర్మించారు. అధికారులు గతంలో అడ్డుకున్నా పట్టించుకోలేదు. ఐదు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వం ఉండడంతో అతని ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. జతీయ రహదారి స్థలాన్ని ఆక్రమించుకుని దాదాపు ఐదు సంవత్సరాలకు పైగా అయింది. అప్పట్లో పలు ప్రజాసంఘాలు వీటిని స్వాధీనం చేసుకుని ఆ స్థలాలు కాపాడాలని డిమాండ్ చేశారు. అయినా అప్పటి అధికారులు, పాలకులు పట్టించుకోలేదు.

ప్రభుత్వ స్థలాలు చౌకగా ..

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని, వాటిని అమ్ముకోవడానికి ఇబ్బందులు పడే వ్యక్తుల నుంచి అతి చౌకగా ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేసి, దర్జాగా భవనాలు నిర్మించడం ఈ వైసీపీ నాయకుడి ప్రత్యేకత. జడ్జి బంగ్లాకు సమీపంలో ఉన్న ఐదు సెంట్ల స్థలాన్ని కూడా ఆయనతో పాటు మరో ఇద్దరు కలిసి తక్కువ మొత్తం చెల్లించి, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అలాగే సైదాపురానిక వెళ్లే దారిలో ఉన్న ఎద్దుగోరీ స్థలాన్ని అతి చౌకగా కొనుగోలు చేసినట్లు సమాచారం. వీటిలో భవనాలు నిర్మించారు. రైల్వేస్టేషన్ సమీపంలోని రాయచోటి రహదారి పక్కన ఉన్న రైల్వే స్థలాన్ని కూడా తక్కువకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ స్థలానికి ఖాళీ జాగా పన్ను వేయాలని మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇకనైనా ఈ వైసీపీ నాయకుడి ఆగడాలకు కూటమి ప్రభుత్వం అడ్డుకట్ట వేసేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఫీడర్లను పరిశీలిస్తున్న ఏడీఈ



గాజుకుంటపల్లిలో వాటర్ ట్యాంక్ వద్ద మట్టిని వేస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

తనకల్లు, జూలై 29: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఫీడర్లను మార్చడం ద్వారా లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించినట్లు విద్యుత్ ఏడీఈ ఓబు లేసు తెలిపారు. మండలంలో విద్యుత్ కోతలు, లో ఓల్టేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వ్యవసాయ బోరుబావుల మోటార్లు పదే పదే కాలి పోయేవి. మరోవైపు మండలంలో 17 పంచాయతీలు, 174 పల్లె వాసులు వేళాపాల లేని విద్యుత్ కోతలతో సతమతమయ్యేవారు. ఈ సమస్యలపై కోతలు.. వెతలు పేరుతో ఆంధ్రజ్యోతి ఆదివారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించి విద్యుత్ ఏడీఈ సోమవారం కొక్కంటి క్రాస్‌లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. ఫీడర్లను మార్చి లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించామని, కోర్తికోట ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఆయన వెంట ఏఈ శ్రీకాంత్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

తొలగిన మురుగు

ఓబుళదేవరచెరువు, జూలై 29: మండలంలోని ఓడీచెరువు, గాజుకుంటపల్లి తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసింది. ఈ సమస్యలపై సోమవారం కంపుకొడుతున్న పల్లెలు అన్న పేరుతో ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన ఈఓఆర్‌డీ రాజశేఖర్, ఇనగూరు సర్పంచ్ చిక్‌వేలు బాబా ఫకృద్దీన్ గాజుకుంటపల్లిలో మురుగున్న ప్రాంతాల్లో మటిని వేశారు. అనంతరం మురుగునీటి కాలవను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. అనంతరం వాటర్ ట్యాంక్ వద్ద మురుగును తొలగించారు. ఈ సందర్భంగా ఈఓఆర్‌డీ మాట్లాడుతూ పారిశుధ్య నివారణకు, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట కార్యదర్శి చంద్ర, మహేష్, ఆంజి, ఆంజనేయులు ఉన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

కొత్తచెరువు, జూలై 29: స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ కార్యకర్తల కోసం బీమాతో కూడిన సభ్యత్వాన్ని అమలు చేశారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల ఐదో తేదీ వరకు సభ్యత్వ నమోదు ఉంటుందన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి త్వరలోనే గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ పూలశివ, నాయకులు గాజుల నాగేంద్ర, నరేంద్రభూపతి, శేఖర్, సల్లప్ప, మధు, రెడ్డప్ప, టెలిఫోన్ వెంకటేశ్ పాల్గొన్నారు.

కాటమయ్యతో రామక్రిష్ణ భేటీ

బత్తలపల్లి: మండలానికి చెందిన సీపీఐ నాయకుడు కమతం కాటమయ్య కొన్నిరోజుల క్రితం ఆ పార్టీకి రాజీనామా చేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ సోమవారం మండలంలోని సంజీవపురం గ్రామంలోని కాటమయ్య నివాసానికి వెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. నీలాంటి వారిని పార్టీ ఎప్పటికి దూరం చేసుకోదని, పార్టీలో కొనసాగలని కోరారు. ఆయన వెంట వేమయ్య, బెల్లం మహదేవ, ఓబులేసు పాల్గొన్నారు.

విద్యార్థులకు శుభ అతిథి భోజన్



కదిరి జౌకపాళ్యం పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

కదిరిఅర్బన్, జూలై 29: ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న శిక్షసప్తాహ్‌లో భాగంగా చివరి రోజైన సోమవారం విద్యార్థులకు శుభ అతిథి భోజన్ పేరుతో విందు భోజనం ఏర్పాటు చేశారు. కదిరి పట్టణంలోని జౌకపాళ్యం హైస్కూల్, మండలంలోని బూరుగుపల్లి పాఠశాలలో దాతల సాయంతో శుభ అతిథి భోజన్ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్‌బీ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు క్రిష్ణవేణి, ఉపాధ్యాయులు ప్రభావతి, శంకర్‌నాయక్, దాతలు హరిమోహన్ పాల్గొన్నారు.

- కొత్తచెరువు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో మాజీ ఎంపీపీ వాణి తనయుడు మిత్ర తన సొంత ఖర్చులతో భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు నరేంద్ర, వెంకటేశ్ పాల్గొన్నారు.
- నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పాఠశాల కమిటీ ఛైర్మన్ లక్ష్మీప్రసాద్ స్వామి విద్యార్థులకు భోజనాలతో పాటు స్వీట్లు, మిక్చర్‌తో భోజనాలు అందించారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు జంషీద్, ఉపాధ్యాయులు కనుముక్కల లక్ష్మణ, లక్ష్మీనారాయణ, సోముశేఖర్, బాలాజీనాయక్, ఆయూబ్ బాషా, ప్రతాప్, యాసిన్, పోతులయ్య, సుధాకర్, చంద్రనాయక్, శ్రీనివాసులు, మారుతి పాల్గొన్నారు.
- నంబులపూలకుంట: మండలంలోని మండెంవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అదేగ్రామానికి చెందిన శేషాద్రినాయుడు విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశాడు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- గాండ్లపెంట: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో అతిథి భోజనాలు సోమ వారం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓలు క్రిష్టానాయక్, శ్రీనివా సులు తెలిపారు. గాండ్లపెంటలో సర్పంచ్ రహంతుల్లా, మల్లమీదపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సాయి నితిన్, పలువురు దాతలు అతిథి భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హైదర్‌వలీ, సిద్దారెడ్డి, ఆదినారాయణ, ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.
- బత్తలపల్లి: స్థానిక జక్కంపూటి వెంకటేసు బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు టీడీపీ నాయకుడు సురేంద్రనాయుడు స్వీట్లు పంచారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కదిరి, జూలై 29: పట్టణంలోని రోడ్డు పక్కన ఎలాంటి అనుమతులూ లేకుండా ఏర్పాటు చేసిన బంకులు, దుకాణాలు మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఉదయం నుంచే మున్సిపల్ సిబ్బంది, అధికారులు దుకాణాలు తొలగించే పనిలో ఉన్నారు. కాలేజీ సర్కిల్‌లో ఉన్న దుకాణాలను మొత్తం తొలగించారు. బాలికల ఉన్నత పాఠశాల రోడ్డులో ఆక్రమణలు తొలగించారు. కొంతమంది ప్రజాప్రతినిధులు ఈ బంకులపై మామూళ్ల వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ముగిసిన బాస్కెట్‌బాల్ శిక్షణ



స్పెయిన్ కోచ్‌లను సన్మానిస్తున్న ప్రతినిధులు

ధర్మవరం, జూలై 29: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఆర్డీటీ సహకారంతో పది రోజులుగా నిర్వహిస్తున్న బాస్కెట్ బాల్ శిక్షణతరగతులు సోమవారంతో ముగిశాయి. స్పెయిన్ దేశానికి చెందిన అంతర్జాతీయ స్థాయి కోచ్‌లు మౌర్, ఒరియోల్, నటాలియా, పోల్ ఈ శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆ కోచ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, సభ్యులు పాల్గొన్నారు.

కక్షసాధింపులు మానుకోవాలి

కదిరి అర్బన్, జూలై 29: అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ కక్షసాధింపులు మానుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. ఆత్మహత్యయత్నాకి పాల్పడి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్యకర్త నాగమణిని ఆయన సోమవారం పరామర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడు వేధించడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆయన వెంట జీఎల్ నరసింహులు, జగన్మోహన్, నారాయణ, బాబ్‌జాన్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, భాగ్యమ్మ, సుజాత, వెంకటలక్ష్మీ ఉన్నారు.

కమిటీ ఏర్పాటు

ముదిగుబ్బ : మండలంలో దొరిగల్లులోని ఎస్సీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నూతన విగ్రహ కమిటీని మండలకేంద్రంలో సోమవారం ఏర్పాటు చేశారు. ఆ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సాకే రంగనాయకులు, మండల అధ్యక్షుడిగా రామాంజినేయులు, మండల ఉపాధ్యక్షుడిగా ఉప్పలపాడు ఆది, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా రాజా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా భాస్కర్, ప్రచార కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం దొరిగల్లులో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తహసిల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌ల పరిశీలన

నల్లమాడ, జూలై 29: మండలంలోని ఆర్‌ఎంపీ వైద్యుల క్లినిక్‌లను ధర్మవరం డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వైద్యులు సునీల్, డాక్టర్ జ్యోష్నా, డాక్టర్ దీప్తి సోమవారం పరిశీలించారు. ఆర్‌ఎంపీ వైద్యుల అర్హత సర్టిఫికెట్లును పరిశీలించి.. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్‌ఎంపీలు ఇంజక్షన్లు వేయకూడదని, కేవలం ప్రథమచికిత్సలు మాత్రమే చేయాలని సూచించారు. వైద్యం కోసం అవసరమైతే ఇతర ఆసుపత్రులకు పంపాలని తెలిపారు. వారి వెంట సీహెచ్‌ఓ రామాంజనేయులు, సిబ్బంది నగేష్, రామచంద్ర, సుశీలమ్మ, సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

భగవద్గీత పారాయణం

గాండ్లపెంట : స్థానిక నటరాజ్ సంతోష నివాసంలో భగవద్గీత పారాయణాన్ని సోమవారం నిర్వహించారు. శ్రీకృష్ణుకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నరసింహరావు, వెంకటేష్, ఓబులరెడ్డి, క్రిష్ణమూర్తి, నాగరాజు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఓడీఎఫ్‌పై సర్వే

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా చేపట్టిన ఓడీఎఫ్‌పై సర్వేలో భాగంగా సోమవారం రెక్కమానుల్లో ఆ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్లు, మూత్రశాలలుపై సర్వే చేసి, లేనివి, ఉన్నవాటిని నమోదు చేశారు. దీని ముఖ్య ఉద్దేశం బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకూడదని, అలాంటి వాటిని గుర్తించడానికి ఈ సర్వే నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ తెలిపారు. ఇంకుడు గుంతలు, మూత్రశాలల నీటిని బయటకు పోతున్నాయో లేదా అని పరిశీలిం చామన్నారు. సర్వేలో సాంకేతిక లోపంతో ముందుకు సాగడంలేదని చెబుతున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రియాజ్ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

గాండ్లపెంట, జూలై 29: మండలకేంద్రంలో హిందువులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డిప్యూటీ తహసీల్దార్ రవికి సోమవారం పలువురు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. శ్మశాన వాటిక కోసం గాండ్లపెంటలో సర్వేనెంబర్ 1136లో ఎకరా 83 సెంట్లు ప్రభుత్వ స్థలంలో ముళ్ల చెట్లను తాము తొలగించి.. శుభ్రం చేయించుకున్నామని, ఆ స్థలాన్ని శ్మశాన వాటికకు అధికారికంగా కేటాయించాలని కోరారు. శ్మశాన వాటికకు రస్తా కూడా ఏర్పాటు చేయాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు ఆనంద్, శ్రీనివాసులు, చెన్నారెడ్డి, నరసింహులు, ప్రసాద్, గోపాల్‌నాయక్ ఉన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నల్లమాడ, జూలై 29: మండలంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు నంద్యాలలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జంప్‌రోప్ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరచి గోల్డుమెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ. తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జయనాథ్‌నాయక్, అలాగే ఎనిమిదో తరగతి చదువుతున్న వివేక్‌కుమార్‌నాయక్ గోల్డుమెడల్ సాధించినట్లు చెప్పారు. ఆగస్టులో జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని జిల్లా సెకటరీ నరసింహనాయక్ తెలిపారు. కార్యక్రమంలో పీడీ ధరణి, వార్డెన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్డీటీ గృహాల ప్రారంభం

ముదిగుబ్బ, జూలై 29: మండలంలోని నల్లచెర్లోపల్లి గ్రామంలో ఆర్డీటీ సంస్థ పేదలకు 17 గృహాలను నిర్మించింది. వాటి నిర్మాణం పూర్తి కావడంతో ఆ గృహాలను స్పెయిన్ దేశస్థులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ హాబిటేట్ సెక్టర్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేదలను ఆదుకోవడమే ఆర్డీటీ లక్ష్యమన్నారు. ఆర్డీటీ సంస్థ ఇప్పటివరకూ 87 వేల ఇళ్లను నిరుపేదలకు నిర్మించి ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆర్డీటీ సంస్థ అనేక సామాజిక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హరికృష్ణ, ఏటీఎల్ క్రిష్ణ, రిజనల్ ఇంజనీర్ మధు, ఏరియా ఇంజనీర్ ఈశ్వరయ్య, గ్రామాల ఆర్గనైజర్లు ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

● మంత్రి సవిత ● వైద్యులతో సమావేశం



వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 29: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత వైద్యులను ఆదేశించారు. సోమవారం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి సవిత తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఓపీ, గర్భిణుల వార్డు తదితరవాటిని పరిశీలించి వైద్య సేవలపై రోగులతో ఆరాతీశారు. అనంతరం వైద్యులతో సమావేశం నిర్వహించి ఆసుపత్రి సమస్యలపై విచారించారు. ఆసుపత్రిలో మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ సమస్య ఉందని మంత్రి దృష్టికి వైద్యులు తీసుకెళ్లారు. త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగరాజునాయక్, టీడీపీ నాయకులు మాదవ నాయుడు, సర్పంచ్ శ్రీనివాసులు, గుట్టూరు సూరి, శ్రీరాములు, మైనార్టీ నాయకుడు దాదు, త్రివేంద్ర, రెడ్డివారి మంజునాథ్ పాల్గొన్నారు.

తెలుగు ప్రజల గుండెచప్పుడు.. వేమన: మంత్రి

పెనుకొండ : వేమన పద్యాలు తెలుగు ప్రజల గుండెచప్పుడని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం పార్టీ స్థానిక కార్యాలయంలో జిల్లా రచయితల సంఘం సభ్యులు ఆగస్టు 25న నిర్వహిస్తున్న వేమన సాహితీయాత్ర కరపత్రాలను మంత్రి విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజాకవి వేమన ఈ ప్రాంతంలో జన్మించడం తమ అదృష్టమన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, ఉమర్‌ఫారూక్, ఎంఆర్ హనుమంతు, ఎంక్యూ గ్లోబుల్ ట్రస్ట్ అధినేత కలీముల్లా, కోగిర జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్ తొలగింపు



లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, జూలై 29 : పట్టణ సమీపంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ జాతీయ రహదారి పక్కన వేసిన అక్రమ లేఅవుట్లను మున్సిపల్ అధికారులు తొలగించారు. జాతీయ రహదారి పక్కన 341సర్వేనంబరులో 1.05ఎకరాల్లో కొందరు రియల్ వ్యాపారులు అహూడా పంచాయతీ అధికారుల అనుమతులు లేకుండా లేఅవుట్ వేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ అక్రమ లేఅవుట్‌లో రాళ్లను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఆయా వ్యాపారులకు నోటీసులు అందించినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

లేపాక్షి, జూలై 23: సాంకేతికత పెరిగిపోవడంతో సెల్‌ఫోన్లలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, వాటిపట్ల విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ గోపీ సూచించారు. సోమవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకూడదన్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధిస్తుంటే ధైర్యంగా ముందుకొచ్చి పెద్దలకు తెలియజేయాలన్నారు. ఇష్టంతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, మహిళా పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు స్టూడెంట్ మార్చ్

పెనుకొండ, జూలై 29: కేంద్ర ప్రభుత్వ పరీక్షల దోపిడీని నిరసిస్తూ ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో స్టూడెంట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పరిటాల డిగ్రీ కళాశాలలో ఏఐఎస్‌ఏ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఎన్‌టీఏ పూర్తిగా విఫలమైందనీ, ప్రతి పరీక్షలో అక్రమాలకు పాల్పడుతూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తోందని మండిపడ్డారు. పరీక్ష పేపర్ లీకేజీ, దోపిడీ వ్యతిరేకిస్తూ ఆగస్టు 9న పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా పెనుకొండలో స్టూడెంట్ మార్చ్ చేపడుతున్నామన్నారు.

తహసీల్దార్లు వచ్చేశారు..!

అనంతపురం టౌన్, జూలై 29: ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు సోమవారం అనంతకు చేరుకుంటున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు వీరిని కడప, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు అప్పట్లో బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇలా వెళ్లిన మొత్తం 39 మంది తిరిగి జిల్లాకు వచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం మధ్యాహ్నం నుంచి రిపోర్ట్ చేసుకున్నారు. రాత్రి 7 గంటల సమయానికి 20 మంది వరకు రిపోర్ట్ చేసుకున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

కాస్తంత వర్షం

అనంతపురం అర్బన్, జూలై 29: జిల్లాలో ని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురి సింది. అనంతపురం, గార్లదిన్నె, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. పుట్లూరు, కూడేరు, బెళుగుప్ప, నార్పల ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి.



అనంతపురంలో కురుస్తున్న వర్షం

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి

పెనుకొండ, జూలై 29: మహిళలు ఆర్థికంగా ఎదిగి, తమ కాళ్లపై తాము నిలబడాలని టింబక్టివ్ కలెక్టివ్ వ్యవస్థాపకుడు మేరీ గంగూలీ అభిప్రాయపడ్డారు. సోమవారం స్థానిక దుర్గాశక్తి సొసైటీ కార్యాలయంలో సొసైటీ 13వ వార్షికోత్సవ సభను నిర్వహించారు . కార్యక్రమానికి లక్ష్మమ్మ అధ్యక్షత వహించగా సీఈఓ కవిత ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మేరి గంగూలి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కలిసికట్టుగా ముందుకెళ్లి అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం సీఈఓ సవిత మాట్లాడుతూ ప్రస్తుతం దుర్గాశక్తి సొసైటీ రెండు మండలాల్లో 79 గ్రామాల్లో 360 సంఘాల్లో 8,655 మంది సభ్యులు ఉన్నారన్నారు. రూ.13.07 కోట్ల నికర విలువతో కొనసాగుతుందన్నారు. అనంతరం ఈ వార్షిక సమావేశంలో వార్షిక వేదిక ఆర్థిక లావాదేవీలు, పాలకవర్గంలో మార్పులు చేర్పులు తదితర విషయాలపై చర్చించారు. మేనేజర్ సుకన్య, మహాశక్తి సీఈఓ రమేజ, అసోసియేట్ రవళి, పావని, గౌరీ, సిబ్బంది మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: మాజీ ఎమ్మెల్యే

మడకశిరటౌన్, జూలై 29: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 1వతేదీన మడకశిరలో పర్యటిస్తున్నారని, అందుకు మేం స్వాగతిస్తున్నామని అయితే ఉమ్మడి జిల్లా సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎంను కోరుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు అనంత, కుద్రేముఖ్ స్టీల్‌ప్లాంట్లను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం శాశ్వత కరవు నివారణకు రూ.7,676 కోట్లను కేటాయించిందని, మంత్రి పయ్యావుల కేశవ్ సైతం ప్రాజెక్టు అనంత అని పేరును "పెట్టారన్నారు. రైతు సమస్యలు, హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేయాలని, పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని, జిల్లాలో కరవు నివారణకు ప్రత్యేక ప్యాకేజీని ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ మంజునాథ్, నాయకులు బాబు తదితరులు ఉన్నారు.





హిందూపురం చౌడేశ్వరి కాలనీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు, అమరాపురంలో భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ

పాఠశాలల్లో పండుగ వాతావరణం

● ముగిసిన 'శిక్షా సప్తాహ' కార్యక్రమం ● విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించిన దాతలు

హిందూపురం(పరిగి), జూలై 29 : జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శిక్షసప్త వారోత్సవం చివరిరోజు తిథిభోజనం కార్యక్రమం నేతులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మహంతేశ్, కమిటీ ఛైర్మన్ సతీష్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్థుల విరాళంతో ఘనంగా భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఎంఈఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ ఇలాంటి రుచికర భోజనం విద్యార్థులకు అందజేయడం కోసం కృషిచేసిన హెచ్‌ఎం మహంతేష్‌కు అభినందనలుతెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 శేషాచలం, టీడీపీ స్థానిక నాయకులు మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సూర్యనారాయణ, వెంకటేశ్, లక్ష్మణ్ రావు, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసులు, లోకేష్, నాగేంద్ర, శివశంకర్, నాగార్జున, రాము, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అగళి: శిక్షాసప్తాహ్ కార్యక్రమం చివరి రోజు సోమవారం శుభతిథి భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆర్.గొల్లహట్టి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు హాజరై సహపంక్తి భోజనంలో కలిసి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయులు సునీత, విద్యార్థులు ఉన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షసప్తాహ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. జడ్పీటీసీ ఉమేష్ హాజరయ్యారు.

పెనుకొండ రూరల్ : రొద్దం మండలంలోని కలిపి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు విద్యాసప్తహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కానిస్టేబుల్ పౌష్టికాహారాన్ని అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. హిందూపురంలో పనిచేస్తున్న గోపాల్ అనే హెడ్‌కానిస్టేబుల్ విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించినట్లు ప్రధానోపాధ్యాయులు నాగేష్ తెలిపారు. విద్యాభివృద్ధికి సప్తాహ్ ఎంతగానో ఉపయోగపడుతుంది- ఎంఈఓ

హిందూపురం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనార్థం ప్రవేశపెట్టిన సప్తాహ్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నాడు. స్థానిక చౌడేశ్వరీ కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలో శుభదిన్ భోజనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మంచి భోజనం అందజేశారు. ఎంఈఓ, హెచ్‌ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయులు ప్రేమలత, మక్తర్, ప్రభాకర్, వసుధ, ధనలక్ష్మీ, షమీద, ఈశ్వర్‌రెడ్డి తదితరులు వున్నారు

హిందూపురం(సోమందేపల్లి) : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గుడిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఆంజనేయులునాయక్, ఆనంద్‌బాబు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, పిల్లలకు గుణాత్మక విద్యను అందించడానికి కృషిచేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు హనుమంతరాయుడు, ఉపాధ్యాయులు నాగరాజు, రమేష్, గణేష్, చంద్ర, టీడీపీ నాయకులు నరసింహప్ప, తలారి సురేష్, సుధాకర్, తరుణ్, విష్ణు పాల్గొన్నారు.

పెనుకొండ : ప్రభుత్వం నిర్వహించిన శిక్ష సప్తహ్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఆఖరి రోజు పాఠశాలలో గ్రామాల్లోని దాతల సహకారంతో భోజనాలు ఏర్పాటు చేశారు. మునిమడుగు గ్రామంలో దాత మాజీ ఎంపీపీ వెంకటరాముడు, పెనుకొండ పాఠశాలలో ఆదినారాయణ భోజనాలకు సహకారం అందించారు. ఎంఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని బాలికల ఉన్నతపాఠశాలలో ప్రముఖులు, సహపంక్తి భోజనం చేశారు. ఎంఈఓ జాన్‌రెడ్డి, హెఎం మాధవిలత, టీడీపీ నాయకులు బాలక్రిష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్, ఉత్తమరెడ్డి, సుబ్రమణ్యం, నరేష్, దేవాంగం నాగరాజు, వెంకటేష్, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

మడకశిర(అమరాపురం) : అమరాపురం మండల పరిధిలో ఉన్న ప్రాథమిక ప్రాథమికోన్నత మండల విద్యాధికారులు రాఘవయ్య, వెంకటరమణ నాయక్ పిల్లలకు విందు భోజనాలను వడ్డించారు.

మడకశిర రూరల్ మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో సోమవారం శభదిన్ భోజన్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మణూర్ ఉన్నత పాఠశాలలో తెలుగు యువత అధ్యక్షుడు మారుతి రెడ్డి, జమ్మానిపల్లి ప్రాథమిక పాఠశాలలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళి బాబు ఆధ్వర్యలు విద్యార్థులకు భోజనం అందజేశారు.



జగదీశ్వరరెడ్డిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేక..!

ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు తమ హాస్టల్ విద్యార్థులకు ఇటీవల హోం సిక్ హాలిడేస్ ఇచ్చాయి. అవి ఆదివారంతో పూర్తయ్యాయి. సోమవారం నుంచి మళ్లీ హాస్టల్‌కు వెళ్లాల్సి రావడంతో ఇద్దరు విద్యార్థులు ఇంటి నుంచి పారిపోయారు. పోలీసులు సకాలంలో వెతికి పట్టుకుని.. తల్లిదండ్రులకు అప్పగించారు. నార్పల మండలం దిగుమర్రికి చెందిన జగదీశ్వరరెడ్డి ఆరో తరగతి చదువుతున్నాడు. నార్పలకు చెందిన సాయికీర్తి తొమ్మిదో తరగతి చదువుతోంది. వీరిద్దరూ అనంతపురం నగరంలోని వేర్వేరు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు. తమ బిడ్డలు కనిపించడం లేదని తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి.. నార్పల బస్టాండ్, పరిసర ప్రాంతాలలో గాలింపు చర్యలు చేపట్టారు. నార్పల బస్టాండ్ సర్కిల్‌లో ఉన్న ఇద్దరినీ గంట వ్యవధిలో పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇంటి నుంచి వెళ్లిపోవడానికి ఇద్దరూ ఒకే కారణం చెప్పడం గమనార్హం. తమకు హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేదని చిన్నారులు చెప్పడంతో తల్లిదండ్రులకు ఎస్‌ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. చదువుల విషయంలో విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావద్దని వారికి సూచించారు.

- నార్పల

పరిహారం చెల్లించాకే రోడ్డు పనులు ప్రారంభించాలి



తహసీల్దార్‌తో చర్చిస్తున్న రైతులు

గోరంట్ల, జూలై 29: మండలంలోని మందపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులు ప్రభుత్వ పరిహారం చెల్లించిన తర్వాతే తమ పొలాల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని తహసీల్దార్ అక్బల్ బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ముదిగుబ్బ, కోడూరు 342 జాతీయ రహదారి విస్తరణ పనులు మండలంలో శరవేగంగా జరుగుతున్నాయి. కొంతమంది రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేయలేదన్నారు. మరికొంతమందికి మంజూరైనా పూర్తి మొత్తంచెల్లించలేదన్నారు. పూర్తి మొత్తం చెల్లించిన తరువాతే పొలాల్లో ప్రవేశించాలని జి రామచంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, మహేష్, రవీంద్రారెడ్డి, నారాయణరెడ్డి, బావిరెడ్డి, హనుమంతురెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, నాగిరెడ్డితోపాటు 13మంది రైతులకు పరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించండి

మండలంలోని పూలచెట్లపల్లికి చెందిన ఉపాధి కూలీలు గత రెండునెలల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఏపీఓ వరప్రసాద్‌ను సోమవారం కోరారు. గోరంట్లలోని ఉపాధి కార్యాలయానికి వచ్చిన కూలీలు పూలచెట్లపల్లిలో 70 మందికి బిల్లులు రాకపోవడంతో పనులకు వెళ్లడం మానివేసినట్లు కూలీలు లక్ష్మీపతి, మునెప్ప, కిష్టప్ప, చిన్నరంగప్ప, క్రిష్ణమ్మ, జయపద్మ, లక్ష్మీనారాయణ తదితరులు తెలిపారు. మూడువేలమంది కూలీలకు సంబంధించి రూ.1.58కోట్లుఉపాధి బిల్లులు చెల్లించాల్సి ఉందని , మంజూరైన వెంటనే చెల్లిస్తామని ఏపీఓ పేర్కొన్నారు.

ఒక్క నిమిషం ఆగితే పోయేదేముంది.!

● తరచూ ప్రమాదాలు జరుగుతున్నా తీరు మార్చుకోని వాహనదారులు ● కొండికొండ చెక్‌పోస్టు వద్ద మారని తీరు

చిలమత్తూరు, జూలై 29: ఒక్క నిమిషం ఆగితే పోయేదేముంది.... మన ప్రాణాలు సురక్షితంగా ఉండటం తప్పా..! ప్రమాదమని తెలిసినా రహదారి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఎదురుగా పెద్ద పెద్ద వాహనాలు దూసుకువస్తున్నా...తామేమీ తక్కువ తిన్నామా అంటూ మృత్యుశకటంలా ఎదురొస్తున్న వాటికి ఎదురెళ్లి ప్రమాదాలకు గురవుతున్నా పద్ధతి మాత్రం మార్చుకోవడం లేదు. ప్రధానంగా మండలంలోని 44వ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టు కూడలిలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కూడలిలో వాహనదారులు తమ భద్రతను గాలికి వదిలేసి అడ్డదిడ్డంగా రోడ్డును దాటుతున్నారు. అసలే జాతీయ రహదారి..వేగంగా వచ్చే భారీ వాహనాలు. అయినా చిన్న వాహనాలు, ద్విచక్రవాహనదారులు, బాటసారులు ఇష్టానుసారంగా రోడ్డు దాటుతున్నారు. గతంలో పలు మార్లు ఈ కూడలిలో ప్రమాదాలు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు గాయాలపాలయ్యారు. ప్రధానంగా చిలమత్తూరు నుంచి బెంగళూరు వైపు వెళ్లే వారు, బెంగళూరు నుంచి హిందూపురం వైపు వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కూడలిలో బస్సులు ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండడంతో రోడ్డుపై ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చిపడుతోందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



కొడికొండ చెక్‌పోస్టు వద్ద అడ్డదిడ్డంగా ఆగిన వాహనాలు

ట్రాఫిక్‌ని కంట్రోల్ చేయాలి

ప్రధానంగా ఈ కూడలిలో ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు రద్దీగా ఉంటుంది. ఈ సమయంలో ప్రయాణికులు అటుఇటూ తిరగడం, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలకు అధికంగా అవకాశం ఉంటోంది. ఈ సమయంలో పోలీసులు జోక్యం చేసుకొని ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించినట్లైతే కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా బెంగళూరు వైపు నుంచి వచ్చే బస్సులు, అనంతపురం వైపు నుంచి వచ్చే బస్సులు ఈ కూడలిలోనే ఆపి ప్రయాణికులను భర్తీ చేసుకుంటున్నారు. దీని వలన బస్సుల కోసం దూరంగా ఉన్న వారు పరుగుతో వచ్చి బస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వాహనాలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని బస్సులు నడి రోడ్డుపై కాకుండా సర్వీస్ రోడ్లో ఆపి ప్రయాణికులను ఎక్కించకుంటే ప్రమాదాలను కొంత వరకు నివారించవచ్చు. ప్రయాణికులు కూడా ఏ వైపుకు ప్రయాణం చేయాలో ఆ వైపే బస్సు కోసం వేచి ఉంటారు. దాంతో ప్రయాణికులు బస్సుల కోసం అటు నుంచి ఇటు...ఇటు నుంచి అటు వైపులకు పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు.

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లావాసులకు చోటు

అనంతపురంరూరల్, జూలై 29: రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘంలో ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కింది. ప్రకాశం జిల్లాలో సంఘం రాష్ట్రస్థాయి కార్యకవర్గ నిర్వహించారు. ఇందులో ఉరవకొండ మార్కెట్ యార్డు అసిస్టెంగ్‌గా పనిచేస్తున్న సుధాకర్ యాదవ్‌కు వర్కింగ్ కార్యదర్శిగా ఎన్నుకొన్నారు. అనంతపురంలో పనిచేస్తున్న యార్డు అసిస్టెంట్ మారెన్నను ఉపాధ్యక్షులుగా, రాయదుర్గం యార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈశ్వరప్పను సహాయ కార్యదర్శిగా, హిందుపురం యార్డులో పనిచేస్తున్న ఆదినారాయణను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొన్నారు.

పురస్కారాల ప్రదానం

పావగడ, జూలై 29: శివకుమార స్వామీజీ, డా. అబ్దుల్ కలామ్ వేదిక తరుపును అందిస్తున్న ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతాయని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ పేర్కొన్నారు. సోమవారం ఎస్ఎస్‌కే సమాదాయ భవనంలో ఎస్ఎల్‌సీ, పీయూసీలలో అధిక మార్కులు పొందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తన తండ్రి బాటలోనే విద్యా వ్యవసాయ రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సభా వేదిక అధ్యక్షుడు రిజ్వాన్ ఆధ్వర్యంలో 36 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కరాలు అందించారు. కార్యక్రమంలో సీడీపీఓ సునిత, కాంగ్రెస్ పాయకులు శంకర్‌రెడ్డి, ఫజులుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు



విద్యార్థులతో ఎమ్మెల్యే వెంకటేశ్

లారీ, బస్సు ఢీ - 8మందికి గాయాలు



బస్సును తొలగిస్తున్న పోలీసులు
చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెనుకొండ టౌన్, జూలై 29: ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. ఆదివారం రాత్రి నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన లగ్జరీ బస్సు బెంగళూరు నుంచి శ్రీశైలం 16మంది ప్రయాణికులతో వెళ్తోంది. పెనుకొండ శ్రీకృష్ణదేవరాయల వైజంక్షన్‌వద్దకు రాగానే అనంతపురం నుంచి వస్తూ పెనుకొండ పట్టణంలోకి వెళ్లేందుకు లారీ యూ టర్న్ తీసుకుంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ వెంకటేశులు అప్రమత్తమయ్యాడు. అప్పటికే ప్రమాదపు అంచుల్లోకి వెళ్లి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ నల్లప్పకు స్వల్పగాయాలు కాగా బస్సు డ్రైవర్‌వెంకటేశ్‌కు తీవ్రగాయాలుఅయ్యాయి. రెస్ట్‌లో ఉన్న మరో డ్రైవర్ కిరణ్‌కుమార్, ప్రయాణికులు స్వాతి, సావిత్రి, గురుప్రసాద్, ముస్తఫ, బాల రంగస్వామికి గాయాలయ్యాయి. వీరిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం బెంగళూరు, హిందూపురానికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ రాజేష్ తక్షణ సహాయ సహకారాలు అందించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హిందూపురం అర్బన్, జూలై 29: విజయవాడలోని అయానా కన్వెన్షన్‌హాల్‌లో ఈనెల 28న జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో పురం సిప్ అబాకస్ బెయిన్ జిమ్ అకాడమీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా వేయి మంది విద్యార్థులు పాల్గొనగా అందులో పురంకు చెందిన సాయి ప్రవచన 10వ స్థానంలో, సాయి అశ్విన్ 8వ స్థానంలో అత్యుత్తమ ప్రతిభ కనిభరిచారని నిర్వహకురాలు మాలతి పేర్కొన్నారు. వీరితో పాటు మొదటి స్థానంలో ఐదుగురు, రెండో స్థానంలో ఇద్దరు, మూడవ స్థానంలో 13 మంది, వీరితో పాటు 38 మంది ప్రతిభా అవార్డులు దక్కించుకున్నారు. విద్యార్థులకు సిప్ అకాడమీ హెడ్ గోపాలకృష్ణ బహుమతులు అందించారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

గోరంట్ల, జూలై 29: మండలంలోని 20 పంచాయతీల పరిధిలో 11,535మందికి పింఛన్ల పంపిణీకి రూ.4,87,25,500 మంజూరైనట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ద్వారా ఈనెల 31న నగదు డ్రా చేసుకుని ఆగష్టు 1న ఉదయం 6గంటల నుంచి సాయంత్రం వరకు 99 శాతంపంపిణీ పూర్తి చేసేలా చర్యలు చేపడ్తామన్నారు. గత నెలలో 11,579మందికిగాను రూ.7,89,46,500 పంపిణీ చేశామన్నారు. ఇందులో44మంది మృతిచెందారని గుర్తించామన్నారు. ఓఏపీ 6,875, వితంతు 2,226, వికలాంగులు 1,222, చేనేత 279, ఒంటరి మహిళలు 348, మొత్తం 11,535 మందికి అందిస్తామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

లేపాక్షి, జూలై 29 : భార్య పుట్టింటికి వెళ్లడంతో జీవితంపై విరక్తిచెంది వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందాడు. సోమవారం సడ్లపల్లి పంచాయతీ తిలక్‌నగర్‌లో ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోపీ తెలిపిన వివరాల మేరకు తిలక్‌నగర్‌కు చెందిన దేవరాజ్(25) కూలి పనిచేస్తూ జీవిస్తున్నాడు. భార్య నాగమణి కుటుంబ కలహాలతో నాలుగునెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో ఒంటరి జీవితాన్ని భరించలేక సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉన్న కొక్కికి చీరతో ఉరివేసుకుని మృతిచెందాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ గోపీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు మారెమ్మ ఉత్సవాలు

అగళి, జూలై 29 : మండల కేంద్రంలో వెలసిన మారెమ్మ దేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. మండలం వ్యాప్తంగా నరసంబుది, రామాపురం, మధుడి, ఆలూడి, అగళి, తదితర గ్రామాల్లో మారెమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై, అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

సజావుగా వేలంపాట

హిందూపురం(సోమందేపల్లి), జూలై 29: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సోమవారం వేలంపాటలు సజావుగా జరిగాయి. గత నెలలో వాయిదా పడ్డ వేలం పాటలను తిరిగి చేపట్టిన అధికారులు వారపుసంతకు సర్కారివారి పాట రూ.13లక్షలు నిర్ణయించగా ఎనిమిది నెలలకుగాను రూ.13,00,500కు నల్లగొంద్రాయనపల్లికి చెందిన హరిక్రిష్ణ దక్కించుకోగా, బస్టాండు రూ.50వేలు సర్కారివాట కాగా మాజీ ఎంపీటీసీ కిష్టప్ప రూ.50,500కు దక్కించుకున్నారు. వీటి కాలపరిమితి ఎనిమిది నెలలుగా నిర్ణయించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ, వేలం దారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫొటోలు అందజేస్తున్న జనసేన నాయకులు

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోల అందజేత

మడకశిర(అమరాపురం), జూలై 29: అమరాపురం మండలంలో హలుకూరు పంచాయతీ ఉదుగూరు గ్రామంలోని సచివాలయం-2కు సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలను జనసేన నాయకులు అందజేశారు. ఈకార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు నవీన్‌కుమార్, మండల జనసేన ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, టీడీపీ మాజీ సర్పంచ్ ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన సభ్యత్వ నమోదుకు ఆగస్టు 5వతేదీ వరకు పొడిగించామని తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు అనిల్, ధనుంజయ, సురేష్, నరేష్, యశు తదితరులు పాల్గొన్నారు.

పావగడ ప్రజలకు రుణపడి ఉంటా : ఎంపీ

పావగడ, జూలై 29: సొంత నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా ఓడించినా చిత్రదుర్గం నియోజకవర్గంలో ఎన్‌డీఏ ఎంపీ అభ్యర్థిగా 50 వేల ఆధిక్యతంతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని చిత్రదుర్గం ఎంపీ గోవింద కారజోళ పేర్కొన్నారు. సోమవారం ఎస్ఎస్‌కె రంగ మందిరంలో నిర్వహించిన ఎంపీకి సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పావగడకు అవసరమైన ఎగువ భద్రనీరు, హెచ్చినహొళే నీటి ప్రాజెక్టును తరలించేందుకు కేంద్ర జలవనురల శాఖ మంత్రి సీకేపాటిల్‌తో చర్చించి రూ.5,300 కోట్ల నిధులను మంజూరు చేయించామన్నారు. మాజీ ఎమెల్యే తిమ్మరాయప్ప, తిమ్మారెడ్డి, శివప్రసాద్, డా. వెంకటరామయ్య, ఆర్‌సీ అంజినప్ప, ఎంకె నారాయణప్ప, రంగన్న, లింగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ గోవింద కారజోళ

తాగునీటి సమస్యకు పరిష్కారం

మడకశిర(అమరాపురం), జూలై 29: అమరాపురం మండలం హేమావతి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమయ్యింది. ఎన్నికల ప్రచార సమయంలో మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి గ్రామప్రజలు తీసుకురావడంతో బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు. సోమవారం బోరు వేయించడంతో హేమావతి గ్రామప్రజలు ధన్యావాదాలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నరేష్, అధ్యక్షులు తిప్పజ్జ, జయకుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.